క్లుప్తంగా

నిత్యాన్నదానానికి పలువురి విరాళాలు



దాత దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెనుమంట్ర మండలం జుత్తిగకు చెందిన సత్తి షణ్ముఖసిరి రూ.10,1116, హైదరాబాద్‌కు చెందిన పొనంగిపల్లి వెంకట సత్య కృష్ణకిషోర్, నాగసాయి లక్ష్మీప్రియాంక దంపతులు రూ.10,116, పెదవేగి మండలం కె.కన్నాపురానికి చెందిన పి.నాగేశ్వరరావు, లలిత సత్య ధనలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును దాతలు ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

గోశాలకు దాణా వితరణ



అంతర్వేదిలో గోశాలకు వితరణ చేసిన పశువుల దాణా

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలోని గోశాలకు బుధవారం మలికిపురం మండలం మేడిచర్లపాలేనికి చెందిన భక్తుడు ఎం.అప్పారావు 280 కిలోల పశువుల దాణాను వితరణ చేశారు. ఈ మేరకు దాణాను సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్ సమక్షంలో గోశాల నిర్వాహకులకు అందజేశారు. స్వామి సేవా బృందం సభ్యులు బెల్లంకొండ సూరిబాబు, జె.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు సాయం పంపిణీ



అగ్ని బాధితులకు సాయం చేస్తున్న రత్నకుమారి

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక సబ్‌స్టేషన్ రోడ్డులోని అగ్నిప్రమాద బాధితురాలు కోళ్ళ వెంకాయమ్మ, మంగాయమ్మలకు బుధవారం సర్పంచ్ ఓగూరి రత్నకుమారి సాయం పంపిణీ చేశారు. కట్టెలు పొయ్యి నుంచి ఎగసిన మంటల వల్ల జరిగిన ప్రమాదంలో బాధితులు సర్వస్వం కోల్పోయారు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా వచ్చిన రేషన్ బియ్యం 25 కేజీలతో పాటు సొంతంగా కొంత నగదును ఆమె అందజేశారు. ఓగూరి బాబులు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.


కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగికి సాయం



కాకినాడ ఆసుపత్రి వద్ద రోగి కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న యూత్

సఖినేటిపల్లి: మండల కేంద్రానికి చెందిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగి అత్తిలి సాయి గాయత్రికి బుధవారం గొంది కనక ముత్యాలమ్మ యూత్, వేర్వేరు ప్రాంతాల దాతలు సంయుక్తంగా సమకూర్చిన నగదు మొత్తం రూ.1,47,509 అందజేశారు. ఈ మేరకు కాకినాడలోని ఒక ఆసుపత్రిలో రోగి గాయత్రికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం చికిత్స అవసరాలు నిమిత్తం ఆసుపత్రి వద్దకు వెళ్లి వారంతా రోగి కుటుంబ సభ్యులకు పై నగదును అందజేశారు.

శంకర్ థియేటర్ తనిఖీ



శంకర్ థియేటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

సఖినేటిపల్లి: ఉయ్యూరువారి మెరకలోని శంకర్ థియేటర్‌ను బుధవారం తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. థియేటర్‌లో ప్రేక్షకుల సౌకర్యాలు, లైసెన్స్‌లు, రికార్డులను పరిశీలన చేశారు. థియేటర్‌లో విక్రయించే తినుబండారాలను, తాగునీటి బాటిళ్లను ఆయన పరిశీలించారు. ఏపీ సినిమా రెగ్యులేషన్ రూల్స్ ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను థియేటర్ యాజమాన్యానికి ఆయన సూచించారు. వెంట డీటీ సీహెచ్ భాస్కర్, మండల ఆర్ఐ రామరాజు, వీఆర్వో సత్యనారాయణ, జాన మల్లిబాబు పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తి చేస్తారో?

- కాజ్‌వే ఆధునీకరణ కోసం ప్రజల ఎదురుచూపులు
- అధ్వాన స్థితిలోనే ఆర్అండ్‌బీ రోడ్డు
- ఏడాది పాలనలో ఫలితం శూన్యం



పూర్తిగా శిథిలమైన అప్పనపల్లి కాజ్‌వే

మామిడికుదురు: పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వే ఆధునీకరణ కోసం ఎంతో కాలం నుంచి తీర గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నా దానికి మాత్రం మోక్షం లభించడం లేదు. ఈ వేసవి సీజన్‌లో అయినా కాజ్‌వే అభివృద్ధికి నోచుకుంటుందని మూడు గ్రామాల ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. అయినా వేసవి సీజన్ ముగిసింది. వర్షాకాలం సీజన్ సమీపించింది కానీ కాజ్‌వే పనులు మాత్రం ప్రారంభం కాలేదు. గోదావరి వరదలు, వర్షాకాలంలో ఈ కాజ్‌వే మీదుగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. కాజ్‌వేతో పాటు పాశర్లపూడి ఏటిగట్టు దిగువ నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వెళ్లే ఆర్అండ్‌బీ పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో మూడు గ్రామాల ప్రజలు వర్షాలు, గోదావరి వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక మాదిరి వరదకే కాజ్‌వే నీట మునిగిపోయి మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ఏడాది అయినా కాజ్‌వేతో పాటు ఆర్అండ్‌బీ రోడ్డుకు మోక్షం లభిస్తుందని ఆశించినా చివరకు నిరాశే మిగిలింది.

ఏడాది కావస్తున్నా ఫలితం లేదు..

కూటమి అధికారం చేపట్టి ఏడాది అయింది. గతంలో కూటమి నేతలు ఈ కాజ్‌వే పునర్నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వాన పరిస్థితిపై ధర్నాలు, రాస్తారోకోలు చేసి హడావుడి చేశారు. మేము అధికారంలోకి వస్తే తక్షణం కాజ్‌వేను ఆధునీకరించి, రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ రెండు అభివృద్ధి పనులపై కూటమిలో ఏ ఒక్కరూ మాట్లాడే సాహసం చేయడం లేదు. దీనిపై కూటమి శ్రేణులే పెదవి విరుస్తున్నారు. కొంత మంది పార్టీ కార్యకర్తలు నేతలను కాజ్‌వే పనులు, ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధిపై బాహాటంగా నిలదీస్తున్నారు. 'ఎన్నికల్లో హామీ ఇచ్చాం. మేము తలెత్తుకోలేకపోతున్నాం' ఈ రెండు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారంటూ నిలదీస్తున్నా ప్రజా ప్రతినిధుల్లో మాత్రం స్పందన శూన్యం. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించి ఈ రెండు అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలని మూడు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలి



పి.గన్నవరంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు, పార్టీ శ్రేణులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పి.గన్నవరంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అబ్జర్వర్లుగా హాజరైన పార్టీ సీనియర్ నాయకుడు పీకే రావు, మార్గాని గంగాధర్‌లు మాట్లాడుతూ కొత్తగా ఎన్నికయ్యే మండల కమిటీలు పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. సుమారు 12 ఏళ్ల పాటు మండల అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించిన నక్కా వెంకటేశ్వరరావు ఈసారి అధ్యక్ష పదవికి పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. పార్టీకి విశేష సేవలు అందించిన ఆయనను కోఆర్డినేటర్ గన్నవరపు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల నూతన కమిటీ అధ్యక్ష పదవికి ఒక పేరును సూచిస్తూ అధిష్టానానికి పంపారు. పార్టీ రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, మెల్లం మహలక్ష్మి ప్రసాద్, పితాని నర్సింహరావు, యన్నాబత్తుల ఆనంద్, మద్దుల వరలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి దొమ్మేటి దుర్గారావు, యూత్ అధ్యక్షుడు మట్టపర్తి పండు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, గుత్తుల మధు, పి.కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



కొమారమ్మను దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: నేదునూరు శివారు శిరసవల్లి సావరంలో కొలువైన కొమారమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను బుధవారం గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి వేదపండితులు విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు, రుత్వికుల వేదఘోష మధ్య అమ్మవారిని వైభవంగా ప్రతిష్ఠించారు. అమ్మవారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారి అత్తింటి వారిగా కాకిలేటి వంశీకులు, పుట్టింటి వారిగా చింతలపూడి వంశీకులు వ్యవహరించడానికి గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కనకమహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో నూతనంగా నిర్మించిన కనకమహాలక్ష్మి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రముఖ వేద పండితుడు కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబు, కాళ్లకూరి రవితేజశర్మ మంత్రోచ్ఛారణల మధ్య పురోహితుల బృందం శైవాగమ పద్ధతిలో రెండో రోజు బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈనెల 31 విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రాయితీపై పశువుల దాణా



పశువుల దాణా అందిస్తున్న ఎంపీపీ సత్యవాణి

మలికిపురం: ప్రభుత్వం 50% రాయితీతో అందించే పశువుల దాణా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. గుడిమెళ్లంక పశువైద్యశాల వద్ద బుధవారం జరిగిన పంపిణీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వరరావు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే 50 కేజీల పశువుల దాణాలో రాయితీ పోను రైతుల వాటా రూ.555 చెల్లించాలన్నారు. పశువులకు ఉచిత నట్టల నివారణ మందులు అందించారు. ఇది వాడటం వలన పాల దిగుబడి పెరగుడంతో పాటు ఖర్చు కూడా తగ్గి పాడి రైతుల లాభాల బాటలో వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నల్లి విజయకుమారి ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, వైస్ సర్పంచ్ కటారి సుబ్బరాజు, రైతులు రావు గోపాలం, ఈద మోహనరావు, చొప్పల మోహనరావు, దేశెట్టి బ్రహ్మానందం, ముద్దాల సత్యనారాయణ, పెదపాటి మాధవరావు, రాపాక రమేష్, గుడాల ప్రసాద్ పాల్గొన్నారు.

కనువిందు చేసిన బ్రహ్మకమలం



మామిడికుదురులో వికసించిన బ్రహ్మ కమలం

మామిడికుదురు: అరుదైన బ్రహ్మ కమలాలు మామిడికుదురులో మంగళవారం రాత్రి కనువిందు చేశాయి. గనిశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి మురళి ఇంటి ప్రాంగణంలో రాత్రి 11 గంటల సమయంలో ఈ పుష్పాలు వికసించాయి. దీంతో వారు బ్రహ్మ కమలాలకు పూజలు చేశారు. ఈ పుష్పం కేవలం ఏడాదిలో ఒకసారే వికసిస్తుందని పెద్దలు పేర్కొన్నారు. విష్ణుమూర్తి నాభి నుంచి బ్రహ్మదేవుడు ఏ విధంగా ఉద్భవించాడో అదే విధంగా బ్రహ్మకమలం వికసిస్తుందని అందుకే దీన్ని బ్రహ్మ కమలంగా పిలుస్తారన్నారు. దీనిని కింగ్ ఆఫ్ హిమాలయ ఫ్లవర్‌గా కూడా పిలుస్తారని తెలిపారు. ఈ పుష్పాలు ఎన్నో వైద్య ప్రయోజనాలకు ఉపయోగపడతాయన్నారు.

విడివిడిగా ఎన్టీఆర్ జయంతి నిర్వహణ

అంబాజీపేట: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పుల్లేటికుర్రులో టీడీపీ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీగా నిర్వహించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రులలో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ జల్లి బాలరాజు తన నాయకులతో కలసి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పార్టీలో ఎంత కష్టపడి పనిచేసిన గౌరవం ఇవ్వకుండా అవమానిస్తున్నారని బాలరాజు పేర్కొన్నారు.

కిశోర బాలికలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



చొప్పెల్లలో ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: కిశోర బాలికలు రుతుక్రమ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని పరిశుభ్రత పాటించడం ద్వారా వైరస్ సంబంధిత వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్ అన్నారు. ప్రపంచ రుతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. రుతుక్రమ సమయంలో యుక్త వయస్సుకు వచ్చిన కిశోర బాలికలు పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల హెల్త్ క్లినిక్‌ల పరిధిలో కిశోరీ బాలికలతో కలసి వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి రుతుక్రమంలో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, హెచ్‌వీలు పి.ఉమ, ఆర్.బాలామణి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దు



ఎస్సై శాస్త్రి

అయినవిల్లి: వాహనచోదకులు వాహనాలు నడుపుతూ అర్జెంట్ కాల్ రావడంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తు ఉంటారని ఇటువంటి చర్యలు వల్ల ఘోర ప్రమాదాలు సంభవించవచ్చని అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. బుధవారం ఎస్సై స్థానిక విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ అవసరమైందన్నారు. ఈ సెల్‌ఫోన్ వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. సెల్‌ఫోన్ అవసరం ఉండవచ్చు కానీ వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌ను ఉపయోగించకూడదన్నారు. దీని వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రయాణ సమయంలో కాల్స్ వస్తే రోడ్డు పక్కన ఎవరికీ ఇబ్బంది లేని స్థలంలో వాహనాలు ఆపి అప్పుడు కాల్స్ మాట్లాడాలన్నారు. అలాగే మైనర్లు, యువత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. అమ్మాయిలను ఏడిపించే ఆకతాయిలను, దొంగతనాలకు పాల్పడే వారిని, అల్లరి మూకలను చట్టపరంగా వదిలిపెట్టేది లేదన్నారు.

ఏడుగురి అరెస్ట్

రావులపాలెం: గంజాయి అమ్మడంతో పాటు సేవిస్తున్న ఏడుగురుని అరెస్ట్ చేసినట్టు టౌన్ సీఐ శేఖర్ బాబు బుధవారం తెలిపారు. మండలంలోని ఊబలంక ఏటిగట్టు సమీపాన అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని పట్టుకుని విచారించగా వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. దీని విలువ మార్కెట్లో రూ.5 వేలు ఉంటుందన్నారు. ఈ కేసులో ఊబలంకకు చెందిన సత్తి భాస్కర వీరరెడ్డి, పెసంగి సింహాద్రి, రావులపాలేనికి చెందిన శిరిగినీడి పవన్, సత్తి వీర సత్య సాగర్ రెడ్డి, మల్లిడి కిరణ్ రెడ్డి, మెర్లపాలేనికి చెందిన వాసంశెట్టి చంద్రమౌళి, ర్యాలీ గ్రామానికి చెందిన మామిడిపల్లి నాగరాజు ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడంతో పాటు కొత్తపేట కోర్టుకు హాజరు పర్చినట్టు సీఐ తెలిపారు.

అనాథ పిల్లలకు 'సాథీ' సర్వేతో ఆధార్



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రమీలారాణి

రాజోలు: అనాథ పిల్లలకు సాథీ (సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సిస్ టూ ట్రాకింగ్ హోలిస్టిక్ ఇంక్లూషన్) సర్వే నిర్వహించి ఆధార్ కార్డులు మంజూరు చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి అన్నారు. సాథీ సర్వే నిర్వహించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మేరకు కోర్టు కాంప్లెక్స్‌లో జడ్జి ప్రమీలారాణి నాలుగు మండలాలకు చెందిన పోలీస్, ఐసీడీఎస్, విద్యాశాఖ, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆధార్ కార్డులు లేని అనాథ పిల్లలను, నిరాశ్రయులను గుర్తించి ఆధార్ నమోదు చేయించాలన్నారు. రాజోలు కోర్టు పరిధిలోని రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో మే నెల 26వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. ఏజీపీ గుబ్బల రజిత, రాజోలు సీఐ నరేష్‌కుమార్, సీడీపీఓ రమాదేవి, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



వెదిరేశ్వరంలో ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శిస్తున్న కళాకారులు

రావులపాలెం: ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని వ్యాధిగ్రస్తులను సమాజంలో వివక్ష చూపకుండా కలసిమెలసి జీవించాలంటూ కళాజాత బృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ ప్రదర్శనలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి వ్యాపించే విధానం, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్ష చూపకూడదంటూ అవగాహన కలిగించారు. బుర్రకథ కల్చరల్ ఈవెంట్స్ కళాబృందం సభ్యులు వీధి నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ గీతాంజలి, హెచ్ఎం కె.నందిబాబు, చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా స్ట్రెయిట్‌కట్ పనులు

సఖినేటిపల్లి: శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు కేశవదాసుపాలెం గ్రామ శివారు మెండుపాలెం వద్ద నుంచి అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వరి చేలల్లోని ముంపునీరు సముద్రంలోకి దిగేందుకు పూర్వం ఏర్పాటు చేసిన స్ట్రెయిట్‌కట్ ఇరువైపులా గట్లు పటిష్టం చేసే పనులు బుధవారం చేపట్టారు. ఇటీవల రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్ట్రెయిట్‌కట్‌ను పరిశీలించి, డ్రెయిన్స్ అధికారులకు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ పనులు వారు చేపట్టారు. వేసవిలో స్ట్రెయిట్ కట్ పొడవునా వేస్తున్న ఇసుక మేటలు తొలగించడంతో పాటు, స్ట్రెయిట్ కట్ రెండు వైపులా గట్లు పటిష్టం చేసే విధంగా అధికారులు పొక్లెయినర్‌తో పనులు నిర్వహిస్తున్నారు. ఉండపల్లి అంజిబాబు, యెనుముల తాతాజీ, డ్రెయిన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



మెండుపాలెం వద్ద స్ట్రెయిట్‌కట్ గట్టు పటిష్టతకు పొక్లెయిన్‌తో చేపట్టిన పనులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అయినవిల్లిలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు



కొత్తపేటలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ శ్రీకర్, ఎంపీపీ

అయినవిల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం అయినవిల్లి మండలంలోని వినాయక సేవా సదన్ వద్ద ఎంపీడీఓ జి.వెంకట సరోవరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ యోగాసనాలను రోజూ వేయడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. అలాగే యోగాతో మానసికోల్లాసం అలవడుతుందన్నారు. ఈ రోజు ప్రతి ఒక్కరూ వయస్సుతో నిమిత్తం లేకుండా యోగాసనాలు సాధన చేయడం మంచిదన్నారు. యోగాసనాలను వ్యాయమోపాధ్యాయులు వెంకట రామారావు, సానబోయిన విష్ణు కుమారి నేర్పించారు. అనంతరం ఉమ్మడి ఏపీ మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ఆర్ఐ రాయుడు, అయినవిల్లి పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, నాయకులు పోలిశెట్టి రాజేష్, సలాది బుచ్చిరాజు, మట్టపర్తి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: యోగాతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.బీమారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా చాలా ముఖ్యమన్నారు. యోగా చిన్న వయస్సు నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో ఒత్తిళ్లకు గురవుతున్న ప్రతీ ఒక్కరూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, గోసంగి సత్యనారాయణ, మట్టపర్తి హరి, మైలా ఆనందరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కొత్తపేట: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆర్డీఓ పి.శ్రీకర్, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. యోగా ఆంధ్రా మాసోత్సవం.. యోగా శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పీఎస్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకర్, ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కొత్తపేట గ్రామ పరిధిలోని 5 సచివాలయాల ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ నిత్యం గంట పాటు ధ్యానం, యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఎవరి స్థాయిలో వారికి ఒత్తిడి పెరిగిపోయిందని, దాంతో మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రాంబాబు, ఈఓపీఆర్డీ డి.సుబ్బారావు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం: యోగా వల్ల శారీరక ఆరోగ్యమే గాక మానసిక ఆరోగ్యం కలుగుతుందని కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ తెలిపారు. రావులపాలెం వేమన కల్యాణ మండపం వద్ద ఎంపీడీఓ మహేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మండల స్థాయి యోగాంధ్ర శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నెల రోజులు పాటు యోగాను క్రమం తప్పకుండా పాటిస్తే ఆ తర్వాత ఎవరికి వారు కొనసాగిస్తారన్నారు. ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన ఎంపీడీఓ మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, శిక్షకులు మల్లాది సత్యనారాయణలను ఆర్డీఓ అభినందించారు.